# ఆదర్శం చిన్నబోయింది

"నమస్కారం రాధమ్మగారూ! నేను చాలా లేటుగదూ?"
రాధమ్మగారింట్లో జరిగే సమావేశానికి దాదాపు అందరూ వచ్చేశారనుకున్న కౌసల్య లోనికొస్తూ అంది ప్రెసిడెంట్ రాధమ్మగారితో.

"ఆ...అవునోయ్! మేమంతా యెప్పుడో వచ్చేశాం. ఇందాకట్నించి నీ కోసమే చూస్తున్నాం. అయినా నీలాంటి చిన్నపిల్లలే ఇంత లేట్ చేస్తే ఇంక మాబోటివాళ్ళేం ఏమను కోవాలి?" అక్కసుగా అంది సెక్రటరీ కాంతమ్మ.

"సారీ అండీ! ఇందాకే వచ్చేద్దామని బయల్దేరాను. తీరా బయలుదేరే సమయానికి బంధువులొచ్చారు. అందుకే ఆలస్యమైంది" నొచ్చుకుంటూ అంది కౌసల్య.

"ఫరవాలేదు కౌసల్యా! అంతా మనమేగా. అయినా అంత కొంపలంటుకునే తొందరపన్లూ లేవు" అని నవ్వేసి, "ఆఁ ఇంక మొదలు పెడదామా?" అంది అందరికేసీ చూస్తూ రాధమ్మగారు.

"ఓ! కానీండి ఇంకా ఆలస్యం దేనికి?" తన పట్టుచీర జరీ అంచులు సరిచేసుకుంటూ అంది కాంతమ్మ.

రాధమ్మగారు స్వతహాగా సంపన్నురాలే కాక చదువు, సంస్కారం ఉన్న మహిళ, ఉన్నంతలో పరోపకారం చెయ్యాల్లనే తపన ఆవిడకి చిన్నతనంనుంచీ ఉంది. అది వయసుతో పాటు పెరిగి, ఇప్పుడు ఆమెనొక ఆదర్శ మహిళగా తీర్చి దిద్దింది.

ఆవిడ ఒక చక్కని సేవాసదనంలాంటిది స్థాపించింది. అది కేవలం గొప్పకోసం స్థాపించిందిగా గాక అనేక మంచి పనులకు ఆలవాలమైంది. దానికాకారణం కేవలం ఆవిడ కృషే. ఇది దినదినాభివృద్ధిగా పెరిగి ఒక మంచి మహిళా నిలయంగా రూపు దిద్దుకుంది. ఎంతోమంది పెద్దల సహాయ, సహకారాలు అందుకుంది. మొదట్లో గొప్పకోసం కొంతమంది చేరినా రాధమ్మగార్ని అర్థంచేసుకుని త్వరలోనే ఆవిడ అడుగుజాడల్లో నడుస్తూ సేవాసదనానికి అనేక విధాల సహాయంచేస్తూ ఇంకా దాని అభివృద్ధికి తోడ్పడసాగారు. అందరూ కలిసికట్టుగా మసలి అనేకమంది అనాధలకి అనేకరకాల ఉపాధులు కల్పించారు. చాల క్లబ్బుల్లోలాగా "మీవారి జీతం ఎంత?" అనీ, "అరె! ఈ చీర ఔటాఫ్ ఫేషన్! ఇలాంటిది కొన్నారేం?" అనీ "ఏమిటి మీ ఇంట్లో వంటమనిషి లేదూ? అబ్బ! ఎలా చేసుకుంటారు బాబూ! వంటపని బోర్." అనీ, ఇలాంటివన్నీ మొదట్లో తలెత్తినా సున్నితంగా అణచేసింది రాధమ్మగారు. ఆమె కలెక్టర్ భార్య దగ్గర్నించి ప్యూన్ భార్య వరకు, అందరితోనూ ఆదరంగానూ, ఆప్యాయంగానూ మాట్లాడుతుంది. అందుకే ఆవిడంటే చాల ఇష్టపడేవాళ్ళు దాదాపు అక్కడి వాళ్ళంతా!

ఇటీవల సంభవించిన వరదలవల్ల నష్టపోయిన అనాధలకి అనేక విధాలుగా సాయంచేసి, అటు పదిమందిలో మంచి పేరూ, ఇటు మానసికంగా ఎంతో తృప్తి కలిగిన ఈ తరుణంలో వారిలో ముఖ్యమయినవారు పదిమంది కలిసి ఒక చిన్న పార్టీ లాంటిది చేసుకుంటున్నారు ఈరోజు. అందుకే అంతా అక్కడికి హాజరయ్యారు. ఆలస్యంగా వచ్చిన ట్రెజరర్ కౌసల్య తన ఆలస్యానికి నొచ్చుకుంటూ క్షమార్పణ చెప్తూ ఉంది.

ప్రెసిడెంట్ రాధమ్మగారికి ఒకే ఒక కూతురు కల్పన. ఆమెకీమధ్యనే వివాహమయింది. ఇంటినిండా బంధువులు వున్నారు.

పెళ్ళికి ముందు, పెళ్ళి తరువాత కూడా నిర్విరామంగా పాటుపడిన ఆమె శ్రద్ధకి చాలమంది ఆశ్చర్యపోయారు. ఇటు పిల్లని పంపి, అటు అనేకమంది నిరాశ్రయులకి సాధ్యమయినంత సహాయం అందించిన రాధమ్మగారి మనసు ఎంతో హాయిగానూ, మరింత ఉల్లాసంగానూ ఉంది. ఆవిడని అంత సరదాగా ఏనాడూ చూడని అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"జానకమ్మగారూ అన్నీ సిద్ధమేగా" అంటూ వంట ఇంటివేపు చూసింది, రాధమ్మగారు.

"ఆఁ అన్నీ సిద్ధమేనమ్మా! ఇంక ప్లేట్లలో సర్దమంటారా?" వినయంగా అంది వంటావిడ జానకమ్మ.

"ఊఁ... కానీండి" అనేసి, "ఆఁ రండి" అంటూ పక్కనేవున్న ఒక పెద్దగదిలోకి అందర్నీ తీసికెళ్ళి, ఒక పెద్ద

టేబిల్ చుట్టూ వున్న కుర్చీల్లో కూర్చోపెట్టి తనూ ఓ దాంట్లో కూర్చుంది. ఆ గది అలంకరణ, వస్తుసామగ్రి ఆమె యెంత కలిగిన ఇల్లాలో చెప్పకనే చెపుతున్నాయి. జానకమ్మ, మరో వంటమనిషీ కలిసి చకచకా ప్లేట్లలో స్వీట్స్, హాట్స్ నింపేశారు.

అంతా తినటం ప్రారంభించాక "మీ పాప మేక్సీ చాల బావుంది. ఎక్కడ కొన్నారు?" అంది రాధమ్మగారు కాంతమ్మగారి కూతురు వేసుకున్న మేక్సీ పరిశీలనగా చూస్తూ.

ఎప్పుడూ ఇలాంటి సంభాషణల్లో పాల్గొనని రాధమ్మగారి మాటలకి పొంగిపోయిన కాంతమ్మ-

"ఇది యింపోర్టెడ్ మేక్సీ! మా పిల్లలు చాల మటుకు ఫారిన్‌వి తప్ప వెయ్యరు. అన్నీ ఫారిన్! ఫారిన్! ఏమిటోనండీ వీళ్ళతో మహాచావొచ్చింది. మా పెద్దది, 'ఆఁ ఇండియా చీర లేం చీరలు. పట్టుగిట్టు బోర్! ఒక్కసారి కట్టుకుంటే చాలు అన్నీ ముడతలే! అమ్మమ్మ చీరలు, ఈ శారీ చూడు-ఇంపోర్టెడ్ శారీ! నేనిలాంటివే కట్టుకుంటాను బాబూ' అంటుంది" గబగబా చెప్పేస్తోంది పిల్లల్ని మురిపెంగా విసుక్కుంటూ. అయితే ఆవిడ మాటల్లోని గర్వపు ఛాయలు రాధమ్మగారు గమనించకపోలేదు. చిన్నగా నవ్వి,

"అవునండీ. ఇదంతా ఫారిన్ యుగం" అనేసి తినటం ప్రారంభించింది.

హఠాత్తుగా పక్కనే వెలిగించి పెట్టిన అగరొత్తి ఒకటి కౌసల్య చీరమీదపడి పైటకొంగుమీద రూపాయిబిళ్ళంత

కాలిన బెజ్జం ఏర్పడింది. అనుకోని ఈ సంఘటనకి అంతా తెల్ల పోయారు. పక్కనే కూర్చున్న రాధమ్మగారు గభాల్న కాలిన చోట నలిపేసి, "అరె, సారీ కౌసల్యా! చీర కొత్తదిలావుంది. అయ్యొ! ఎలా పడింది?" అంది నొచ్చుకుంటూ.

"ఆఁ ఫరవాలేదండీ, నాచెయ్యే తగిలింది. కాస్తేగా!" అనేసింది కౌసల్య. కానీ ఆమె మనసంతా దిగులుగా అయి పోయింది. ఆ చీర తనెంతో మనసుపడి కొనుక్కుంది. అది చాల బావుందని అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారుకూడ. అదీగాక కట్టుకున్న చీర కాలితే అపశకునం అంటారు. ఏమిటో! ఎందుకిలా జరిగింది? మనస్సులోనే మథనపడసాగింది. అందరూ సానుభూతి చూపుతూ తలోమాటా మాట్లాడారు.

కాంతమ్మగారు కౌసల్య రాగానే గమనించింది, ఆ చీర ఇంపోర్టెడ్ శారీ అని. 'అది తనకెలా వచ్చిందబ్బా' అనుకుంది. కాస్త ఈర్ష్యపడిందికూడ. ఆమేకాదు దాదాపు అందరూ అను కున్నారు ఆ చీర చాల బావుందని ఐతే రాధమ్మగారిముందు చీరల గురించి, నగల గురించి యెక్కువగా మాట్లాడరు కనుక యెవరూ యేమీ కామెంట్ చెయ్యలేదు. రాధమ్మగారుకూడ చీర నాణ్యతని, రంగునీ, డిజైన్ని మెచ్చుకుంటూంటే యింక ఆగలేక అంతా చీర బ్రహ్మాండంగా వుందని ఒప్పేసుకున్నారు. అది అలా కాలినందుకు సంతాపం వెలిబుచ్చారు.

కుతూహలం పట్టలేని కాంతమ్మగారు, "కౌసల్యా! ఆ చీర ఎక్కడ కొన్నావ్?" అంది. అందరూ అలాటి భావాన్నే కనపరుస్తూ ఆమెకేసి చూశారు.

"అదీ...అదీ...మా పనిమనిషి దగ్గర కొన్నాను" అనేసింది తడబడుతూ కౌసల్య.

అంతా 'షాక్' తిన్నారు. "ఏమిటీ! పనిమనిషి దగ్గరా" ఏకకంఠంతో అడిగారు.

"అవును! అమెరికానుంచి చాలా బట్టలు వరదలవల్ల నష్టపోయినవారికోసం వచ్చాయిగా? అందులో మా పనిమనిషికి కూడ చీర ముట్టిందట. అది 'ఈ చీర నాకెందుకమ్మగారూ ఇలాంటివి మేం కడతామా యావన్నానా మీరు కావాలంటే తీసుకోండి' అంది. దాని నాణ్యతా అదీ చూసిన నేను దాన్ని ఒదులుకోలేకపోయాను. అది తీసుకునేందుకు యెంతమందిని నొప్పించాల్సివచ్చిందో! అంతలా ఆకర్షించిందా చీర. అందుకే దానికి డబ్బు యిచ్చి తీసేసుకున్నాను" అమాయకంగా ఉన్నదున్నట్లు చెప్పేసింది కౌసల్య.

కాంతమ్మగారి ముఖం మతాబాలా వెలిగిపోయింది. 'ఓ అలా చెప్పు!' అన్నట్టుగా కౌసల్యమీద ఓ చూపు పడేసి, "ఏమిటో రాధమ్మగారూ! ప్రతివాళ్ళకీ విదేశీయ వస్తువులే కావాలి. అయినా ఇంత మంచిచీర ఎప్పుడూ చాకిరీతో సతమతమయ్యే ఈ కౌసల్య కెందుకు చెప్పండి. అహం మనోలా ఏను కోకండి కనీసం వంటమనిషయినా లేదు వాళ్ళింట్లో" తన విషాన్నంతా మాటల్లోనూ చూపుల్లోనూ కక్కేసింది కాంతమ్మ.

కౌసల్య ముఖం అవమానభారంతో పాలిపోయింది. తన భర్త డాక్టరే! కానీ తమ కుటుంబం పెద్దది. ఆర్థికంగా చాల

వెనకబడి వుంది. ఒకరి సంపాదనమీద చాలమంది బతకాలి. తన కుతూహలం చూసి అత్తగారు ఈ సదనంలో బలవంతంగా చేర్పించింది. భర్తకంతగా ఇష్టంలేకపోయినా, కాంతమ్మ మాటలకి అంతా తెల్లపోయారు. రాధమ్మగారు ఓసారి ఆవిడకేసి తీక్షణంగా చూసి.

"సారీ కౌసల్యా! కాంతమ్మగారి మాటలు పట్టించుకోకు. ఆవిడ స్వభావమే అంత! అయినా ఇదంతా నా తప్పే. ఎప్పుడూ లేనిది నేను, చీరలగురించి, నగల గురించి మాట్లాడ్డం ఏమిటి! అది అలుసుగా తీసుకుని ఆవిడ అలా మాట్లాడటం ఏమిటి? ఏదో జరిగిపోయింది ఏమీ అనుకోకు" బాధపడుతూ ఆప్యాయత నిండిన గొంతుతో అంది రాధమ్మగారు. కౌసల్య ముఖంలోని అవమాన వీచికలు చూసి.

"అహఁ అదేంలేదు. ఫరవాలేదు ఆవిడ వున్నమాటే అన్నారు" పైకి అలా అన్నా అవమానాగ్ని ఆమెని దహించి వేస్తోంది.

పార్టీ అయ్యేలోపు మెన్నో కబుర్లు, సరసోక్తులు చెప్పి, భారంగా గడుస్తున్న కాలాన్ని తేలికపరిచింది రాధమ్మగారు. దాదాపు అంతా మామూలు స్థితికొచ్చారనుకున్న ఆమె మెల్లగా మొదలుపెట్టింది.

"చూడండి మీ రెవరూ మరోలా అనుకోకూడదు. సందర్భం వచ్చింది కనుక చెపుతున్నాను. ముఖ్యంగా కౌసల్య బాధపడకూడదు. ఆమె నా కూతుర్లాంటిది. అమాయకు

రాలు. నా అభిమానికూడ! అందుకే ఆమె యీ చీరకొన్న తరుణంలో నేనిలా చెప్పటానికి సాహసిస్తున్నాను. ఇది ఆమెని చిన్నబుచ్చటానికి మాట్లాట్టం కాదని ఆమెకీ తెలుసు. కారణం నేనంటే ఆమెకున్న గౌరవాభిమానాలు మాత్రమేనని నాకూ తెలుసు.

మనం ఇక్కడికి ఎందుకొచ్చాం? మనంచేసిన పనులవల్ల మనకి ఆత్మసంతృప్తి కలిగింది కనుక. ఆ ఆనంద సమయంలో యిలా కలుసుకున్నాం.

మనం ఎంతో డబ్బు కలెక్ట్ చేసి యిచ్చాం. బట్టలు, గిన్నెలు, చెంబులు, ఆహారపదార్థాలు, ఇలాటివెన్నో అంద చేశాం. ఎందుకు? వారు నిరాశ్రయులుగా మన ఎదుట నిలి చారు కనుక తోటి మానవులు అల్లాడిపోతుంటే చూడలేక కొంత సహాయం చేశాం. ఆ సహాయం విలువ ఎంత? ఎడారిలో ఇసుక రేణువంత. కొండంత దైవానికి కొండంత పత్రి సమర్పించు కోలేంకదా! అందుకే ఉడతాభక్తిగా తోచిన సహాయం చేశాం.

అలానే అనేకమంది అనేక దేశాల్నించి సహాయం అందించారు డబ్బురూపేణా వస్తురూపేణాకూడా. ఒక దేశా న్నించి రగ్గులు, స్వెటర్లు యింకా అనేకరకాల బట్టలూ వస్తే మరొక దేశాన్నించి వస్తుసామగ్రీ, పాలడబ్బాలు అవీ ఎవరికి తోచినవి వారు పంపారు. ఎందుకు? పాపం! సాటిమానవులు నిరాశ్రయులయిపోయారు వారికి కట్టుబట్ట, తినతిండి, నిలువనీడ

లేదనీ ఏదో కాస్తలో కాస్త చేయూతనిద్దామని. ఆ సహాయం ఎంతవరకు ముట్టిందనేదే నాబాధ. బ్రెడ్ దగ్గిన్నించి, గుడ్డలు, గిన్నెలుకూడా చాల పెద్దమనుషులుగా సంఘంలో చలామణి అయ్యేవాళ్ళుకూడ తీసుకుంటున్నారు. రగ్గు ఒకటి పేదవానికి ముట్టిందా? ఒకవేళ ముట్టినా అది మరో పెద్దమనిషి డబ్బు ఆశ చూపించి తీసుకోవటం న్యాయమేనా? అసలు మనం అనాధలమా? కట్టుబట్టలతో ఉన్నామా? అలాంటివి తీసుకోటానికి సిగ్గూ లజ్జా అడ్డురావా? పాలపౌడర్ దగ్గిన్నించే దాచి ఇంటి వద్ద వాడుకుంటున్నామంటే మనం పాలుకూడా కొనుక్కో- లేని నిరుపేదలమన్నమాట! ఎవరో పెట్టిన భిక్ష మనం 'దేహి' అని తీసుకుంటున్నామన్నమాట. కౌసల్యా. నువ్వు కాదమ్మా! నువ్వు కొన్నావ్ కొంతనయం! కానీ అసలు వారికి అందనియ్యకుండా కోటులు, బిస్కట్లు దొంగిలించి తమ పిల్లల కందించే పెద్ద మనుషుల సంగతి! అయితే అందరూ అలా వున్నారని అనను. ఎంతోమంది మహానుభావులు తమకి లేకపోయినా యెన్నో విధాలుగా పాటుపడి సాయం అందించారు. కొందరు స్వార్థ పరులమాటే నేను చెప్పేది. నీదగ్గర నాకు చనువు వుంది కనుక చెప్తున్నాను కౌసల్యా! మరోసారి అలా చెయ్యకు. మీకందరికీ కష్టం కలిగించాయా నామాటలు? అయినా మనం అంతా ఒకే త్రాటిమీద నడుస్తున్నాం కనుక మీకు బాధ కలిగించవు. ఒకవేళ బాధ కలిగించితే క్షమించండి.

కౌసల్య చిన్నపిల్ల! తను లోతుగా ఆలోచించక అలా

చేసింది. అందుకేగా మనం కలెక్ట్ చేసిన్వి గొప్పకోసం ఎవరి చేతికీ ఇవ్వక బాధితులకే స్వయంగా అందచేశాం. అంతేనా కౌసల్యా!" చిరునవ్వు నవ్వుతూ ముగించింది రాధమ్మగారు. ఆవిడకి కాంతమ్మగార్ని గురించి పూర్తిగా తెలియను. అందుకే అంత విపులంగా మాట్లాడింది.

సిగ్గుతో తలవంచిన కౌసల్య "అవును రాధమ్మగారూ! మీరు చెప్పింది నూరుపాళ్లూ నిజం! నేను పూర్తిగా మీ అడుగుజాడల్లో నడుస్తాను" ఆరాధనగా అంది ఆమె.

కాంతమ్మగారి ముఖం కాలిన పెనంలా అయిపోయింది. అందరూ తనకేసే పట్టి చూస్తున్నట్టు తోచింది. కారణం!

కాంతమ్మగారిది పెద్దలోగిలి. వరద బాధితుల కోసం వచ్చిన అనేక సామాన్లు వాళ్ళవీ కొన్ని గదులు తీసుకుని సర్దారు. అక్కణ్నించి భాగాలుగా మారి ఎగిరిపోతున్నాయి. ఆవిడ సెలక్టుచేసుకున్నవి బీరువాలు చాలటంలేదు. ఇటీవల ఆవిడగారి సంతానంకట్టే బట్టలన్నీ ఇవేనని వేరే చెప్పనక్కర్లేదు. ఈ విషయం ఒక్క రాధమ్మగారికి తప్ప దాదాపు అందరికీ తెలుసు.

రాధమ్మగారు మరోసారి అందరికీ క్షమార్పణలు చెప్తూ కుంది. పార్టీ ముగిసింది.

పదిరోజుల తర్వాత ఒకరోజు సాయంత్రం మళ్ళా అంతా సమావేశమయ్యారు, ఏదో మీటింగ్ అని. సాధారణంగా ఇలాంటివన్నీ రాధమ్మగారింట్లోనే జరుగుతూ ఉంటాయి.

మాటలూ నిర్ణయాలూ అయ్యాక కాఫీ సేవిస్తున్న సమయంలో ప్రక్కవూర్లో వున్న ఫ్రెండ్ ఇంటికెళ్ళిన తన కూతురు, అల్లుడు దిగారు హడావిడిగా.

రాధమ్మగారు హడావిడి పడుతూ టిఫిన్ అదీ పంపింది అతనితో పాటే మేడమీదికి.

అరగంట తర్వాత కూతురు కిందికి దిగి వచ్చి "మమ్మీ ఈరోజు ప్లెయిట్‌లో ఢిల్లీ వెడుతున్నాం అక్కణ్నించి కాష్మీర్ డాడీకి క్లబ్‌లో కనిపించే వచ్చాం. ఇంక టైంలేదు. అన్నీ మొన్నే సర్దేశానుగా! అసలు రేపుగదా వెడదామనుకున్నదీ. కాదు ఈరోజే అన్నారు మీ అల్లుడు." గడగడా చెపుతున్న కూతుర్ని మురిపెంగా చూస్తున్న రాధమ్మగారి కళ్ళు కూతురు కట్టుకున్న కొత్తచీరమీద పడ్డాయి.

ఉలిక్కిపడింది, "అవునూ ఈచీర ఎప్పుడు కొన్నావ్?" ఆశ్చర్యంగా అడిగింది.

కౌసల్యా బృందం కూడ కుతూహలంగా చూస్తున్నారు రాధమ్మగారి కూతుర్నీ అల్లుడ్ని మళ్ళీ ఓసారి చూద్దామని ఆగారు వెళ్ళకుండా.

"అన్నట్టు నీకు తెలియదుగదూ! ఇది ఇంపోర్టెడ్ శారీ అమ్మా! ఎంత బావుందో చూశావా? అబ్బ! యిలాటి డిజైన్ ఎక్కడా చూడలేదు. ఇది ఒక లేబర్ స్త్రీ అమ్ముతుంటే

కొన్నానమ్మా. కాని కొంచెం పైటకొంగు కాలింది. పరవాలా రూపాయికాసంత! డార్నింగ్ చేయించేస్తాను. ఇది మీ అల్లుడు గారికూడా యెంతో నచ్చింది. అందుకే యిప్పుడు కాస్త చిరిగినా కట్టుకున్నాను. కనిపించటంలేదుగా యిలా దోపేస్తాను" పైటకొంగు కాలిన భాటుని తిప్పి నడుంలో దోపేస్తూ వుత్సాహంగా చెప్పుకుపోతున్న కూతుర్ని నిర్ఘాంతపోయి చూసింది రాధమ్మగారు. అప్రయత్నంగా కౌసల్యకేసి చూసింది.

"అవును రాధమ్మగారూ అది నా చీరే! ఆ చీర నేను మా పనిమనిషి కిచ్చాను డబ్బుకూడ తిరిగి తీసుకోకుండా. అది మళ్ళా కల్పనగారి కిచ్చినట్లుంది" అంది మెల్లగా కౌసల్య.

రాధమ్మగారి ముఖం కత్తివేటుకి నెత్తురుబొట్టు లేనంతగా పాలిపోయింది. యేదో అవబోయేంతలో-

"కల్పనా! రెడీయేనా? ప్లేన్‌కి టైమయిపోతోంది. వస్తాం అత్తగారూ! ఈహనీమూన్ ట్రిప్ పది హేనురోజులుమాత్రమే! మామయ్యగారితో చెప్పండి" అంటూ కల్పనతోసహా వెళ్ళి పోయాడు అల్లుడు.

ఇంపోర్టెడ్ శారీ కుచ్చెళ్ళు సున్నితంగా తన్నుకుంటూ విలాసంగా నడిచిపోతున్న కూతుర్ని అలా చూస్తూండిపోయింది రాధమ్మగారు.

(ఆకాశవాణి విజయవాడ)

(०)—(०)